క్లుప్తంగా

ఉద్యమకారులందరిని ప్రభుత్వం గుర్తించాలి

బల్మూర్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 2న ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ కొందరిని మాత్రమే ఉద్యమకారులుగా గుర్తించి, మరికొందరిని మరిచారని బల్మూర్ మండల మలిదశ ఉద్యమకారులు పాత్కుల సురేష్, బోట్కా ఉస్సేన్, తమటం విజయకృష్ణ, గణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష తరువాత మలిదశ ఉద్యమంలో తాము కీలకంగా ఉండి, బల్మూర్ మండలంలో అన్ని రాజకీయ పార్టీలను సంఘటితం చేసి జేఏసీ ఏర్పాటు చేశామన్నారు. ప్రజాసంఘాల బాధ్యులమైన మేము వివిధ రూపాల్లో ప్రతిరోజూ నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. అప్పట్లో తమపై పోలీసు కేసులు కూడా నమోదయినా.. ఒత్తిళ్లకు లొంగకుండా ఉద్యమించామన్నారు. ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులతో పాటు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

రత్నగిరి ఫౌండేషన్‌తో మెరుగైన సేవలు

కొల్లాపూర్: రత్నగిరి ఫౌండేషన్‌తో పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులకు, యువతకు అవసరమైన సేవలు అందిస్తామని మంత్రి జూపల్లి తనయుడు అరుణ్ రావు అన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని మినీ స్టేడియంలో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌రావు మాట్లాడారు. మా నాన్నమ్మ, తాతయ్య జ్ఞాపకార్థం ఫౌండేషన్ ఏర్పాటు చేశామని వివరించారు. వేలాది మంది విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణలు అందించామన్నారు. ఇప్పుడు కంప్యూటర్ శిక్షణలతో పాటు, ఉపాధి అంశాలపై కూడా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలకు ఉపయోగపడే కార్యక్రమాలు కూడా చేపడుతామన్నారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని వెల్లడించారు. ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ మాట్లాడారు. సమ్మర్ క్యాంపులో క్రీడలపై విద్యార్థులకు అవగాహన ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

రేపు రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం


నాగర్‌కర్నూల్ రూరల్: కొల్లాపూర్ మండలం, సింగోటంలో ఈ నెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా రాజకీయ శిక్ష తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తరగతులకు మండల, జిల్లా నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి సోమవారం అందించారు. ప్రభుత్వ కళాశాలపై నమ్మకం ఉంచి, చేర్పించిన వారి తల్లిదండ్రులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయని, పది పూర్తయిన విద్యార్థుల తల్లిదండ్రులు విధిగా ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఉపాధి కూలీలు



పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని చంద్రబండ తండా రోడ్డుకు ఉపాధి హామీ పథకంలో 50 మంది కూలీలు 1,400 మొక్కలు నాటినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ అష్రఫ్ తెలిపారు. వర్షం పడటంతో మొక్కలన్నీ బతుకుతాయన్నారు. మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు పొలాలను దున్నే పనిలో నిమగ్నమయ్యారు.

హత్య కేసు నిందితులను అరెస్ట్ చేయాలి

కొల్లాపూర్: చిన్నంబావి మండలం లక్ష్మీపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డిని హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేయాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ డిమాండ్ చేశారు. హత్య జరిగి పది రోజులు దాటినా ఇప్పటి వరకు నిందితులను పోలీసులు గుర్తించకపోవడం దారుణమన్నారు. నిజమైన నిందితులను తప్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లుగా కనిపిస్తోందన్నారు. కేసును నీరుగార్చేలా అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. పోలీస్ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, నిజమైన నిందితులను అరెస్ట్ చేయాలని కోరారు.

రైతులను అప్రమత్తం చేస్తూ..

- గ్రామాల్లో కొనసాగుతున్న అవగాహన సదస్సులు
- విత్తనాల కొనుగోలుపై సలహాలు, సూచనలు
- నకిలీ విత్తనాలతో నష్టపోకుండా చర్యలు



ఐతోల్‌లో ఫర్టిలైజర్ దుకాణంలో విత్తనాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



తాడూరు శివారు పొలంలో విత్తనాలు విత్తుతున్న కూలీలు

తాడూరు: వానాకాలం పంట సీజన్ రానున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయానికి సిద్ధం అవుతున్నారు. వర్షాలు కురిస్తే విత్తనాలు కొనుగోలు చేసి పంటలు వేసేందుకు అన్నదాతలు ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ విత్తనాల విక్రయంపై దృష్టి సారించింది. ఈ మేరకు విత్తన విక్రయాల్లో అక్రమాలు జరుగకుండా నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతులను అప్రమత్తం చేస్తూ.. వారికి అవగాహన కల్పించేలా గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు రైతు సదస్సులు నిర్వహిస్తున్నారు.

ఎన్నికల కోడ్ ఉన్నందున..

ఈ సారి వానాకాలం రైతు పత్తి, వరి పంటల సాగుపైన ప్రధానంగా దృష్టి సారించారు. నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు, సలహాలు అందించడంతో పాటు ఏఓలు, ఏఈఓలు అవగాహన సదస్సు నిర్వహించి పంటల సాగుపై అర్థమయ్యే రీతిలో తెలియజేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండానే సదస్సులు నిర్వహిస్తున్నారు. కోడ్ ముగిసిన తర్వాత సదస్సుల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయనున్నారు.

అప్రమత్తం చేయడమే లక్ష్యంగా..

విత్తనాల కొనుగోలు విషయంలో రైతులను అప్రమత్తం చేయడమే లక్ష్యంగా అధికారులు గ్రామాలు పర్యటించి సూచనలు, సలహాలు ఇస్తున్నారు. రైతులను పట్టి పీడిస్తున్న నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే అధికారులు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గుర్తింపు పొందిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, గ్రామాలకు వచ్చి లూజ్‌గా విక్రయించే వారిని సమ్మొద్దని ప్రతి కొనుగోలు ప్యాకెట్‌పై అన్ని వివరాలు పరిశీలించడమే కాకుండా, విధిగా రసీదులు పొందాలని అధికారులు సూచిస్తున్నారు. పొందిన రసీదులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని తెలియజేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యానికి ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో సన్నాల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టారు. సన్న ధాన్యం సాగుతో కలిగే లాభాల గురించి అధికారులు రైతులకు వివరిస్తున్నారు. ఎప్పటికప్పుడు సీడ్, మందుల విక్రయ దుకాణాలను ఏఈఓలు, ఏఓలు పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే విత్తనాలు పక్కదారి పట్టకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు.

ఎరువుల వివరాలు

వానాకాలంలో సాగయ్యే పంటలకు 2,872 టన్నుల యూరియా, 1640 టన్నుల డీఏపీ, 1551 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు మొత్తం 7,089 టన్నుల ఎరువుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు.

మండలంలో ఇలా..

మండలంలో 24 గ్రామపంచాయతీలకు గాను 45,200 ఎకరాల సాగు భూమి ఉంది. 18,308 ఎకరాల్లో పత్తి, 8,710 ఎకరాల్లో వరి, 1277 ఎకరాల్లో మొక్కజొన్న, 307 ఎకరాల్లో కంది, 2,500 ఎకరాల్లో మిరప, 55 ఎకరాల్లో జొన్న, 20 ఎకరాల్లో ఆముదం వంటి పంటలు వానా కాలంలో సాగవుతున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

అధికారులు అందుబాటులో ఉండాలి..



వ్యవసాయ అధికారులు ఆయా గ్రామాలు పర్యటించి పంటల సాగుపై అవగాహన కల్పించాలి. ఎప్పటికప్పుడు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఎరువుల వాడకంతో పాటు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటేనే దిగుబడి వస్తుంది.

– బాలస్వామి రైతు అల్లాపూర్

నకిలీ విత్తనాల కట్టడికి చర్యలు



నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. గ్రామాల్లో రైతులకు ఎరువులు, విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్నాం. విత్తనాల దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

– సాయిరమేష్‌కుమార్, ఏఓ, తాడూరు

కొండనాగులలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బల్మూర్: మండలంలోని కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 1993–94 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు తమ బాల్యాన్ని గుర్తుచేసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు జనార్దన్‌రెడ్డి, నర్సింహారావు మాట్లాడారు. బాల్యం మధురమైందని, దాని విలువ ఎనలేనిదన్నారు. తాము బోధించిన విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడి అభివృద్ధి చెందడం ఎంతో అనుభూతినిచ్చిందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను పూలమాలలతో సత్కరించి ఘనంగా సన్మానించారు.

విద్యుత్ సరఫరాకు చర్యలు



బొల్లంపల్లి సమీపంలో చెట్లకొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

వెల్దండ: మండల పరిధిలోని బొల్లంపల్లి, పోతేపల్లి, చెదురుపల్లి గ్రామాలకు వెళ్లే విద్యుత్ సరఫరాలో సోమవారం విద్యుత్ అధికారులు మరమ్మతు చేశారు. బొల్లంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే సరఫరాలో విద్యుత్ వైర్లపై చెట్లకొమ్మలు ఉండటంతో తరచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ స్తంభాల వెంట ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. వర్షాకాలం కావడంతో ఈదురు గాలులకు అంతరాయం ఏర్పడిందన్నారు. వాటిని సరిచేసి విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా వినియోగదారులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ సూర్యం నాయక్, సిబ్బంది ఉన్నారు.

ఆస్పత్రి లైసెన్స్ రద్దు చేయాలని నిరసన

నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణంలో ఓ గర్భిణి మృతికి కారణమైన ప్రైవేటు ఆస్పత్రి లైసెంచ్‌ను రద్దు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ చౌరస్తాలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆపరేషన్లు అవసరం ఉన్నా, లేకున్నా, రూ.వేలు ఫీజులు వసూలు చేస్తూ.. పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని అనే ప్రైవేట్ ఆస్పత్రుల యాజమానులు, వైద్యుల ఆస్పత్రిలో ఎలాంటి సౌకర్యాలు లేకున్నా.. ఇష్టానుసారంగా దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. మృతిచెందిన పద్మ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, హుస్సేన్, రాములు, కృష్ణ, చంద్రయ్య పాల్గొన్నారు.



అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

పాలిసెట్‌లో మెరిసిన విద్యార్థులు



మనోహర్‌రెడ్డి (నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయి 3వ ర్యాంకు)



విజయలక్ష్మి (పాలెం జెడ్పీహెచ్ ఎస్ విద్యార్థిని)

బిజినేపల్లి: మండలంలోని వెల్గొండకి చెందిన మంద మనోహర్‌రెడ్డి బైపీసీ విభాగం పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. రాష్ట్ర స్థాయిలో 106 మార్కులతో 248వ ర్యాంకు సాధించాడు. గుడ్లనర్వకి చెందిన విజయలక్ష్మి పాలిసెట్ బైపీసీలో 938వ ర్యాంకు సాధించగా.. ఎంపీసీ విభాగంలో 1,267వ ర్యాంకు సాధించినట్లు పాలెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు తెలియజేశారు.

బాంబే ఐఐటీలో చదువుకుంటా...



పడిగె సిద్ధార్థ నాగర్‌కర్నూల్

నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణ కేంద్రానికి చెందిన పడిగె పాలిసెట్ ఫలితాల్లో 107వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం మియ్యాపూర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంపీసీ కోర్సులో అడ్మిషన్ తీసుకొని విద్యను అభ్యసిస్తున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే పాలిసెట్ రాసి 107వ ర్యాంకు సాధించానని, భవిష్యత్‌లో తాను బాంబే ఐఐటీలో చదువుకుంటానని తెలియజేశారు.

కేకేరెడ్డి విద్యార్థుల ఎంపిక



మనోహర్



సాయిచరణ్



యశ్వంత్

తెలకపల్లి: కేకేరెడ్డిలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు తెలంగాణ పాలిసెట్ పరీక్షలో ర్యాంకులు సాధించినట్లు ఆ పాఠశాల అడ్వైజర్ రఘురాంరెడ్డి, ప్రిన్సిపాల్ తెలిపారు. పాలిసెట్‌లో మనోహర్ రెడ్డి ఎంపీసీ 561, బీపీసీ 248, సాయిచరన్ ఎంపీసీ 764, బీపీసీ 434, యశ్వంత్ ఎంపీసీ 845, బీపీసీ 780, వర్షిత ఎంపీసీ 1248, బీపీసీ 614, నిశ్వంత్ ఎంపీసీ 1769, బీపీసీ 765, నర్సింహరెడ్డి బీపీసీ 1824, 1179, వరుణ్‌సాయి ఎంపీసీ 5,460 బీపీసీ 2,849, సిరి ఎంపీసీ 7,063, బీపీసీ 3,342, ఎం తేజ 8,486, ఎంపీసీ 4,227, అకిల ఎంపీసీ 7,896, బీపీసీ 4,059, ఆర్ సాహితి ఎంపీసీ 8,804, బీపీసీ 6,682 ర్యాంకులు సాధించినట్లు తెలియజేశారు.

సాంకేతిక విద్యలో రాణించాలని ఉంది



కొమ్ముల శ్రావ్య

నాగర్‌కర్నూల్ రూరల్: మండల పరిధిలోని మంతటికి చెందిన కొమ్ముల శ్రావ్యకు 163వ ర్యాంకు సాధించింది. తాను ఇంజినీరింగ్ విద్యలో రాణించాలని ఉందని, ఆ దిశగా విజయం సాధించేందుకు తాను కర్నూల్‌ఘాట్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంపీసీ గ్రూప్‌లో అడ్మిషన్ తీసుకొని చదువుకున్నట్లు తెలిపింది. భవిష్యత్‌లో సాంకేతిక విద్యలో రాణించాలని ఉందని అన్నారు.

కల్వకుర్తి విద్యార్థి ప్రతిభ



సందీప్

కల్వకుర్తి: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో చదువుకున్న సందీప్ పాలీసెట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో 82, అగ్రికల్చర్ విభాగంలో 36వ ర్యాంకు సాధించాడని చెప్పారు. విద్యార్థిని తల్లిదండ్రులతో పాటుగా, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

కోచింగ్ తీసుకోవడంతోనే ర్యాంకు..

కొల్లాపూర్ రూరల్: మండలంలోని రామాపురానికి చెందిన ఆకునమోని సంతోష్ రాష్ట్రంలో 141వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడారు. కొల్లాపూర్‌లోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. కోస సంస్థ వారు ఉచితంగా పాలిసెట్ కోసం కోచింగ్ ఇవ్వడానికి అర్హత పరీక్షలో అర్హత సాధించడంతో, హైదరాబాద్, కోఠి సాయిమేధా కోచింగ్ సెంటర్‌లో 45 రోజులు ఉచితంగా కోచింగ్ ఇచ్చినట్లు చెప్పారు. అక్కడి అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపి కోచింగ్ ఇవ్వడంతో ర్యాంకు సాధించినట్లు చెప్పారు.



సంతోష్

సారా తయారుచేస్తే చట్టరీత్యా చర్యలు

వెల్దండ: సారా తయారు చేసినా.. విక్రయించినా చటరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గాజులోనిబావితండా, పోషమ్మతండా, రావిచెట్టుబావి తండాలకు చెందిన ఐదుగురిని సారా తయారు చేస్తున్నారని ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని తహసీల్దార్ రవికుమార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సారా తయారు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మరో సారి విక్రయిస్తే భారీగా జరిమానా విధిస్తామన్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది మహేష్ తదితరులు ఉన్నారు.



వెల్దండలో తహసీల్దార్ రవికుమార్ ఎదుట బైండోవర్ చేసిన పోలీసులు

నిరాడంబరుడు వేణుగోపాల్‌రెడ్డి



వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

నాగర్‌కర్నూల్: నిరాడంబర నిస్వార్థ వ్యక్తిగా ఆర్.వేణుగోపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని నాగర్‌కర్నూల్ జాతీయ విద్యా సంఘం ఉపాధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ హఫీజ్ ఖాన్ అన్నారు. జాతీయ విద్యా సంఘం అధ్యక్షుడు నేషనల్ హై స్కూల్ మాజీ ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి సంస్మరణ సభను స్థానిక తిరుమల కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించారు. సమావేశంలో ముందుగా వారి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి పలువురు వక్తలు మాట్లాడారు. 1954 సంవత్సరం నుంచి 2014 వరకు సుమారు ఐదు దశాబ్దాలుగా పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా, కరస్పాండెంట్‌గా, జాతీయ విద్యా సంఘం అధ్యక్షుడిగా విశిష్ట సేవలు అందించిన మహోన్నత వ్యక్తి అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వంటి ప్రభుత్వ ఉద్యోగం వచ్చినప్పటికీ, వదిలేసి విద్యారంగాన్ని ఎంచుకొని ఎందరో బడుగు బలహీన వర్గాల కుటుంబాల్లో వెలుగులు నింపిన మహనీయుడని కొనియాడారు. సమావేశంలో సభా నిర్వాహకులుగా పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్లా ఖాన్ వ్యవహరించగా.. సంఘ సభ్యులు జీవి సుబ్బారావు, పి.మునీంద్రనాథ్, డాక్టర్ నూర్జహాన్, వంకేశ్వరం లక్ష్మయ్య, పోల శ్రీధర్, సాయిబాబుతో పాటు పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, సుందరాచారి, విజయమ్మ, పాఠశాల పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు

నాగర్‌కర్నూల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ముగింపు సందర్భంగా నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సోమవారం అమరులకు నివాళి అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో గర్భిణులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగం శశిధర్ రెడ్డి, పలువురు పార్టీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా..

గుడిపల్లికి చెందిన బీఆర్ఎస్ యువ కార్యకర్త గువ్వల రమేష్ కొన్ని రోజుల కిందట ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి హామీ ఇచ్చారు. రమేష్‌కు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండటంతో ప్రమాద బీమా పథకం కింద రూ.2 లక్షల చెక్కును మంజూరు చేయించి, బాధిత తల్లిదండ్రులకు అందజేశారు.

బిజినేపల్లి: ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన మైబూస్ లాంటి కార్యకర్తల కుటుంబాలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం మైబూస్ కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి రూ.2 లక్షల బీఆర్ఎస్ ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అధికారం లేదని కుంగిపోవద్దని, ఆత్మవిశ్వాసంతో పనిచేసి భవిష్యత్‌లో అధికార పగ్గాలు చేపట్టాలని, అందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రాజేష్ తదితరులు ఉన్నారు.



గర్భిణులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న మర్రి జనార్దన్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

తాడూరు: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మహేందర్ భార్య పద్మ ఏడు నెలల గర్భిణి జిల్లా కేంద్రంలోని ప్రియాంక ఆస్పత్రిలో వైద్యం వికటించి మృతిచెందింది. సోమవారం ఆమె పార్థివ దేహానికి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి కుటుంబాన్ని పార్టీ పరంగా ఆదుకుంటామని, ఇలాంటి సంఘటనలు మరోసారి జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు.

యూనిఫాంను సిద్ధం చేయాలి



మహిళలకు సూచనలు, సలహాలు ఇస్తున్న డీపీఎం వెంకటేష్

తాడూరు: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే యూనిఫాంను గడువులోగా సిద్ధం చేయాలని ఐకేపీ డీపీఎం వెంకటేష్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అమలు చేసిన యూనిఫాం తయారీ మహిళా సభ్యులకు వరం లాంటిదని, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మహిళా సంఘాలను బలోపేతం చేసే క్రమంలోనే యూనిఫాం తయారీని అప్పగించిందన్నారు. ఆయా గ్రామాల్లోని సంఘాల సభ్యులు యూనిఫాం తయారీలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చి గడువులోగా పూర్తి చేయాలన్నారు. యూనిఫాం తయారీకి సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఏపీఎం శేఖర్, లక్ష్మణ్, పద్మ, పార్వతమ్మ ఉన్నారు.

విత్తనాల వివరాలు పొందుపర్చాలి



బిజినేపల్లిలో విత్తన దుకాణంలో తనిఖీలు చేస్తున్న జిల్లా అధికారి బి.పూర్ణచందర్‌రెడ్డి

బిజినేపల్లి: విత్తన వ్యాపారుల నుంచి రైతులు కొనుగోలు చేసే విత్తనాల వివరాలు, లాట్ వివరాలు రసీదుతో పాటు పూర్తి స్థాయిలో పక్కాగా ఫార్మర్ రిజిష్టర్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ కార్యాలయం సహాయ సంచాలకులు బి.పూర్ణచందర్‌రెడ్డి సూచించారు. కొంత మంది రైతులు రసీదుల్లో లాట్ నంబర్ నమోదు చేయడం లేదని, దానిపై దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని తిమ్మాజిపేట ఏఓ కమల్‌కుమార్‌కు సూచించారు. సోమవారం తిమ్మాజిపేట మండల కేంద్రంలోని న్యూ మణికంఠ ఆగ్రో ఏజెన్సీస్, హనుమాన్ సీడ్స్, అన్నదాత సీడ్స్, శ్రీనివాస సీడ్స్, శ్రీబాలాజీ సీడ్స్, ఆగ్రో రైతు సేవా కేంద్రం, రైతు మిత్ర ట్రేడర్స్ వంటి పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాలకు సంబంధించిన లైసెన్సులు, స్టాక్ వివరాలు, రసీదులు, ఫార్మర్ రిజిష్టర్లను పరిశీలించారు. లైసెన్సులు సకాలంలో రెన్యూవల్ చేసుకుని రైతుల్ని గుర్తించి వారిని హెచ్చరించాలని సూచించారు. వ్యాపారుల లైసెన్సులు బయటికి కనబడేలా బహిర్గతం చేయాలన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

చారకొండ: నకిలీ విత్తనాలు అమ్మితే డీలర్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చారకొండ వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్, చారకొండ ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం దుకాణాల్లో సీడ్‌స్టాక్, రిజిస్టార్, గ్రౌండ్ స్టాక్, బిల్‌బుక్స్, స్టాక్ బోర్డు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎమ్మార్పీ ధరలకు అధికంగా విక్రయిస్తే పీడీ యాక్టు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.



చారకొండలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ, ఏఓ